సాక్షి
వికారాబాద్

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



కనికరం చూపని ప్రభుత్వం

సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



పరువు కోసం ప్రాణం..

పరువు పోతుందని భావించిన ఓ కుటుంబం యువకుడిని హతమార్చిన ఘటన కేశంపేట పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో▸



మాన్యాలున్నా..

దేవుడి ఆధీనంలో కోట్లాది రూపాయల ఆస్తులున్నా.. ఆ ఆలయాలు ధూపదీప నైవేద్యాలకు నోచుకోకపోవడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి



మంత్రి మహేందర్ రెడ్డి ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

తాండూరు టౌన్: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు మంగళవారం మంత్రి మహేందర్ రెడ్డి ఎదుట ధర్నాకు దిగారు. ఉదయం మండల కార్యాలయం నుంచి ర్యాలీగా మంత్రి నివాసం చేరుకుని ఇంటి ఎదుట నిరసనకు దిగారు. సీఐటీయూ నాయకులు వారికి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, యూనియన్ అధ్యక్షురాలు బేబి, కార్యదర్శి సుధారాణి, ఉపాధ్యక్షురాలు జయంతి, రాజేశ్వరి, శశికళ, సుజాత, వసంత, వాణి, అంజమ్మ, నర్సమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

అనంతగిరి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చీఫ్ లీగల్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ పారామెడికల్ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మనుషుల అక్రమ రవాణా నేరమన్నారు. బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఎఫ్ఐఆర్, బాల్యవివాహాలు, వరకట్న నిషేధ చట్టం, వెహికల్ చట్టం తదితర వాటిపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు రాజశేఖర్, గోపాలకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటస్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అవార్డుకు ఎంపిక



ప్రశంసాపత్రంతో భరత్‌కుమార్

కుల్కచర్ల: జాతీయ అంబేడ్కర్ అవార్డుకు కుల్కచర్లకు చెందిన కర్రె భరత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో మంగళవారం బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం చేతుల మీదుగా భరతకుమార్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అక్టోబర్‌లో ఢిల్లీలో నిర్వహించనున్న సదస్సులో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. బహుజన సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించిందని నిర్వాహకులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను బొందపెడదాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

పరిగి: రాష్ట్రంలో ప్రజలెవ్వరూ బీఆర్‌ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు(మల్లెమోనిగూడ)కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు 100 మంది టీఆర్ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బొందపెట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిక్లరేషన్లను నెరవేరుస్తామన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి

అనంతగిరి: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వాలని ఉమ్మడి రంగారెడ్డి ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం వికారాబాద్‌లో మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యంతోనే లంచగొండితనాన్ని నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. లంచం అడగడం ఎంత తప్పో.. ఇవ్వడం కూడా అంతే తప్పని గుర్తించాలని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064తో పాటు ఫోన్ 91543 88971, 91543 88970, 91543 88968 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



అలుగు పారుతున్న లక్నాపూర్ ప్రాజెక్టు

ప్రాజెక్టులకు జలకళ

జిల్లాలో అలుగుపారుతున్న చెరువులు, కుంటలు

- జూలై, సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతానికి మించి నమోదు
- అతివృష్టి, అనావృష్టితో దిక్కుతోచని స్థితిలో రైతులు

వికారాబాద్: జిల్లాలో చెరువులు, ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయి జలకలను సంతరించుకున్నాయి. ప్రతి ఏటా సమృద్ధి వర్షాలు కురిస్తే ఆగస్టు లేదా సెప్టెంబర్ మాసాంతంలోగాని చెరువులు పూర్తిగా అలుగు పారేవికావు. అయితే ఈ ఏడాది జూలై మాసం కూడా పూర్తి కాకుండానే 70 శాతం చెరువులు నిండి అలుగుపారాయి. ఒక నెల గ్యాప్ ఇచ్చిన వరణుడు సెప్టెంబర్‌లో మరోసారి విజృంభించడంతో చెరువులతో పాటు ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. జూన్ నెలలో కొంచం అటూఇటుగా సాధారణ వర్షపాతమే నమోదుకాగా జూలై మాసంలో సాధారణ వర్షపాతానికి రెండింతల (380 మిల్లీ మీటర్ల) వర్షపాతం నమోదయ్యింది. ఇక ఆగస్టులో వరుణుడు మోహం చాటేయగా సెప్టెంబర్‌లో మరోసారి విజృంభించాడు. సెప్టెంబర్ నెల పూర్తవ్వడానికి ఇంకా 10 రోజులు మిగిలిఉండగానే ఇప్పటికే సాధారణ వర్షపాతానికి మించి వర్షాలు కురిశాయి. ఈ మాసంలో సాధారణ వర్షపాతం 151 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటికే 180 మిల్లీ మీటర్లు నమోదయ్యింది. దీంతో చెరువులు, కుంటలు నిండి అలుగుపారుతున్నాయి.

ప్రధాన ప్రాజెక్టులకు జలకళ

జిల్లాలో మొత్తం చెరువులు 1,179 ఉండగా ఇందులో 1,050 చెరువులు అలుగు పారుతుండగా మిగతావి 70 శాతానికి పైగా నిండాయి. అయితే ఫీడర్ ఛానల్స్ ఆక్రమణకు గురైన ఓ 10–20 చెరువులు మాత్రమే 70 శాతానికి తక్కువ నీటితో కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఆక్రమణకు గురైన చెరువులతో పాటు తూములు, చెరువు కట్టలు ధ్వంసం చేయడంతో వాటిల్లోకి నీరు చేరలేదు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన లఖ్నాపూర్, జుంటుపల్లి, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్ కాకర్లవాగు ప్రాజెక్టులు పూర్తి గా నిండి అలుగు పారుతుండగా మిగతావి కూడా వందశాతం నీటి మట్టానికి చేరువలో ఉన్నాయి.

ఈఏడాది వింత పరిస్థితి..

జిల్లాలో ఏడాదిలో మొత్తం 6 లక్షల పైచిలుకు ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా.. 5.81 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేశారు. నీరు సమృద్ధిగా ఉండటంతో మరో 1.30 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. 5 లక్షల ఎకరాలకు పైగా ఆరుతడి పంటలు సాగు చేయగా ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి రైతును అయోమయానికి గురిచేశాయి. జూలై మాసంలో అతివృష్టి కారణంగా పొలాలు జాలుపారటంతో పంటలు పాడై దిగుబడిపై ప్రభావం పడింది. పంటలు తేరుకునే సమయంలో ఆగస్టు మాసం మొత్తం వరుణుడు మొహం చాటేశాడు. దీంతో చాలావరకు పంటలు ఎండిపోయాయి. ఇది కూడా మరోసారి పంట దిగుబడిపై ప్రభావం చూయించింది. ఇక సెప్టెంబర్‌లో ఎడతెరిపి లేకుండా వారం రోజుల పాటు భారీ వర్షాలు కురవటంతో మళ్లీ పంట పొలాలు జాలువారాయి. ఇలా ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిసినప్పటికీ కొంత అతివృష్టి.. ఆ వెంటనే మళ్లీ అనావృష్టితో రైతు మొహాల్లో సంతోషం కనిపించకుండా పోయింది.

నష్టాలే మిగిలాయి



ఆరుగాళం కష్టపడి పంటలను పండిస్తే ఓ పక్క అధిక వర్షాలు, మరోపక్క నెలరోజులపాటు అసలు వర్షాలే లేకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపింది.

– నర్సింహులు, రైతు, బొంపల్లి

సాధారణానికి మించి వర్షపాతం

ఈ ఏడాది జూన్‌లో సాధారణ వర్షపాతం నమోదు కాగా.. జూలైలో సాధారణ వర్షపాతానికి మించి రెండింతలు నమోదైంది. ఆగస్టులో లోటు వర్షపాతం నమోదైంది. అదే విధంగా సెప్టెంబర్ మాసంలో ఇప్పటికే సాధారణ వర్షాపాతానికి మించి నమోదైంది.

– సీపీఓ, నిరంజన్‌రావు

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

- సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్
- వికారాబాద్ కలెక్టరేట్‌లో ఓటుహక్కుపై అవగాహన

వికారాబాద్: ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పౌరులు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సినీనటుడు, జిల్లా స్వీప్ ఐకాన్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా విద్యార్థులు, యువతతో ఓటుహక్కు వినయోగంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మన ఓటు ఎంతో అమూల్యమైందని.. మనల్ని పాలించే నాయకులను నిర్ణయిస్తుందన్నారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ముందు వరుసలో నిలపాలి..

రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని జిల్లాను దేశంలోనే ముందు వరుసలో నిలపాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 76 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈ ఏడాది 90 శాతానికి మించి పోలింగ్ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండి ఇప్పటివరకు ఓటరుగా నమోదు చేసుకోనివారందరూ వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణఅమిత్, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావ్, స్వీప్ నోడల్ అధికారి కోటాజి, విద్యార్థులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా..

వికారాబాద్ అర్బన్: ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన జరగాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఫారం 6,7,8 ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులందరినీ ఓటరుగా నమోదు చేయించాలని ఆదేశించారు. ఈరోజు నుంచి ఆన్‌లైన్లో మాత్రమే నమోదు చేసుకోవచ్చని సూచించారు.ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈనెల 25వరకు పరిష్కరించాలని తెలిపారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, స్వీప్ నోడల్ అధికారి కోటాజి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సినీనటుటు శ్రీనివాస్, కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు

విభేదాలు వీడి.. కలిసి పనిచేద్దాం

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- మంత్రి మహేందర్‌రెడ్డి వర్గం నేతలతో ఆత్మీయ పలకరింపులు

బషీరాబాద్: బీఆర్‌ఎస్ నాయకులు విభేదాలు వీడి కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సూచించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా తాను, మంత్రి మహేందర్‌రెడ్డి ఒక్కటయ్యామని.. గ్రామాల్లో రెండు వర్గాల నాయకులు కూడా ఒక్కటై పార్టీ కోసం పనిచేయాలని కోరారు. ఈమేరకు మంగళవారం బషీరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో 'ఫైలెట్ ఆత్మీయ పలకరింపు' కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట నీళ్లపల్లి ఏకాంబరి ఆలయంలో పూజలు చేసిన అనంతరం నీళ్లపల్లి, జలాల్‌పూర్, ఇస్మాయిల్‌పూర్, మైల్వార్ కంసాన్‌పల్లి, ఎక్మాయి, మంతన్‌గౌడ్, బషీరాబాద్, క్యాద్గీరా, జీవన్గీ, కొర్విచెడ్ తదితర గ్రామాల్లో పార్టీ నాయకుల ఇంటిదగ్గర వెళ్లి వారితో మాట్లాడారు. గ్రామాల్లో ఇప్పటివరకు వచ్చిన పనులు కాకుండా ఇకముందు వచ్చే అభివృద్ధి పనుల్లో మంత్రి మహేందర్‌రెడ్డి వర్గానికి, తనవర్గానికి సమభాగం ఉంటుందన్నారు. అందరూ కలిసికట్టుగా వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. ఎక్కడైనా ఇంకా బేదాభిప్రాయాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు. ఈ క్రమంలో బషీరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే నారాయణరావుతో రోహిత్‌రెడ్డి భేటీ అయ్యారు. తనకు మద్దతుగా ప్రచారం చేయాలని కోరారు. దీనికి నారాయణరావు సముఖత వ్యక్తం చేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు పురుషోత్తం రావు, శ్రీశైల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి పాల్గొన్నారు.



జీవన్గీలో నాయకులతో ఐక్యత చాటుతున్న రోహిత్‌రెడ్డి

కాంగ్రెస్‌దే అధికారం



పరిగి: సుల్తాన్‌పూర్‌లో ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

- పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుక్జిందర్ సింగ్

పరిగి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని సీడబ్ల్యూసీ మెంబర్, పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుక్జిందర్ సింగ్ రాందవ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 హామీలపై సోమవారం పరిగి పట్టణంలో డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డితో కలసి పర్యటించి ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ గ్యారంటీ కార్డును ఇస్తూ గోడపై చార్జిషీట్‌ను అతికించారు. ఆయన మాట్లాడుతూ.. మేం ఇచ్చిన 6 హామీలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్, బ్లాక్ అధ్యక్షులు పార్థసారధి, భారత్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండలాల అధ్యక్షులు పరశురాం రెడ్డి,ఆంజనేయులు,విజయ్‌కుమార్‌రెడ్డి,సురేందర్, అశోక్, నారాయణరెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి గ్యారంటీ కార్డు..

కొడంగల్ : తెలంగాణాలోని ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డు అందిస్తుందని మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నానా పటోలే అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు మహారాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం కొడంగల్ పట్టణంలోని రేవంత్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణాలో అవినీతితో కూడిన కుటుంబ పాలన కొనసాగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ధనిక రాష్ట్రంగా ప్రకటిస్తే కేసీఆర్ అప్పులకుప్పగా మార్చారని ఆరోపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ప్రజా వ్యతిరేక పాలనతో ప్రజల నడ్డి విరిస్తున్నారని అన్నారు. తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి అథోలే లోండే పాటిల్, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, మండల కమిటీ అధ్యక్షులు ప్రశాంత్, నర్సింహులు గౌడ్, చంద్రవంచ రఘు, నాయకులు పాల్గొన్నారు.

బాలాపూర్ గణేశ్‌కు మంత్రి సబిత పూజలు

బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుని మొదటి రోజు పూజలో మంత్రి సబితారెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న మంత్రికి లడ్డూ ప్రసాదం అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని గణనాథున్ని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, నాయకులు కాసిక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, శశిధర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు రఘునందన్ చారి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హర్షాతిరేకాలు



మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం నేడు సాకారం అయ్యింది. మహిళా బిల్లుకు మంగళవారం కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే 2028 తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు ఈ రిజర్వేషన్లు కల్పించేలా బిల్లు ఆమోదం చేసింది. దీంతో సర్వత్రా మహిళాలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. పార్టీలకతీతంగా ఈ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

బిల్లు ఆమోదం హర్షణీయం



లోక్‌సభలో మహిళా బిల్లు ఆమోదం పొందడం హర్షనీయం. అయితే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు అయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రిజర్వేషన్‌ను ఐదేళ్ల తర్వాత అమలు చేయడం వల్ల మరో 5 ఏళ్ల జీవితకాలాన్ని మహిళలు కోల్పోతారు.

– సునీత, మాజీ చైర్‌పర్సన్, తాండూరు

బీఆర్‌ఎస్ పోరాట ఫలితమే



చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం ఆమోదం తెలపడం సంతోషంగా ఉంది. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే సాధికారత సాధ్యమవుతుంది. బీఆర్‌ఎస్ పార్టీ పోరాట ఫలితంగానే ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లుతో మహిళలకు సాధికారత లభించింది.

– దీప, వైస్ చైర్‌పర్సన్, తాండూరు

విప్లవాత్మక మార్పులు వస్తాయి



మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఆమోదం పొందడం సంతోషంగా ఉంది. మహిళలు పెద్ద సంఖ్యలో చట్టసభలకు వెళ్తే విప్లవాత్మక మార్పులు వస్తాయి. ఇప్పటికే ఎంతోమంది మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. రానున్న రోజుల్లో మహిళా శక్తిని చట్టసభల్లో చూస్తాం.

– అనిత, ఎంపీపీ, తాండూరు

మహిళా బిల్లుతోనే సాధికారత



లోక్‌సభలో మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం. భవిష్యత్‌లో రాజకీయ రంగంలో మహిళలు ప్రముఖ పాత్ర పోషించనున్నారన్నారు. పార్టీలకతీతంగా ఈ బిల్లును అందరూ స్వాగితించారన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించినట్లే భవిష్యత్‌లో చట్టసభల్లో తమ ప్రతిభ చాటుతారన్నారు.

– వాణిశ్రీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్, కొడంగల్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతోందని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. డీఈవో సుశీందర్‌రావుతో కలిసి మంగళవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులకు వెళ్లి బోధన పరమైన అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే మన విద్యా వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయని పేర్కొన్నారు. విద్యార్థుల బోధన తీరును పరిశీలించిన అనంతరం ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌ను ఆమె అభినందించారు.

క్లుప్తంగా

ఎడ్లను ఢీకొన్న బైక్, వ్యక్తి మృతి

కొడంగల్ రూరల్: ఎడ్లను బైక్ ఢీకొట్టగా.. ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధి రుద్రారం గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం అడికె గ్రామానికి చెందిన మాల అనిల్(21) పనుల నిమిత్తం రుద్రారం గ్రామానికి వచ్చి, తిరుగు ప్రయాణ మయ్యాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన రైతు ఎల్లప్ప తన ఎడ్లను పొలం నుంచి ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో రుద్రారం నుంచి అడికె గ్రామానికి వెళ్తున్న అనిల్ చీకట్లో ఎడ్లను ఢీకొట్ట డంతో బైక్ అదుపుతప్పి కిందిపడింది. దీంతో అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టే బుల్ శివరాములు గౌడ్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య


మల్లప్ప(ఫైల్)

యాలాల: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఉదయం పగిడియాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరవింద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పగిడియాలకు చెందిన నెత్తి మల్లప్ప(32) దినసరి కూలిగా పనిచేసేవాడు. మల్లప్పకు ఇద్దరు భార్యలు ఉండగా, మొదటి భార్య కొంత కాల క్రితం భర్తతో విడిపోయింది. రెండో భార్య అలివేలుతో కలిసి గ్రామంలో ఉంటున్నాడు. కొది రోజులుగా మల్లప్ప మతిస్థిమితం సరిగా లేక ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం సుమారు 7 గంటల ప్రాంతంలో మల్లప్ప తన ఇంట్లో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న మల్లప్పను చూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహాయంతో బాధితున్ని ఆటోలో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలి స్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతుడి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒలంపియాడ్ పరీక్షలో 4వ ర్యాంకు


అవార్డు అందుకుంటున్న విద్యార్థి

పరిగి: సెమ్స్ ఒలంపియాడ్ 2023 గాను నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర స్థాయిలో పరిగి విద్యార్థులు 4, 10వ ర్యాంకులు సాధించారు. పట్టణ కేంద్రానికి చెందిన లక్నాపూర్ శ్రీనివాస్, కవిత దంపతుల కుమార్తె నిహాసిత, కుమారుడు చంద్రనిహాల్ పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఒలంపియాడ్ నిర్వహించిన పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడంతో నగరంలో విశ్రాంత ఐఏఎస్ జగదీశ్వర్‌రెడ్డి విద్యార్థులకు అవార్డు, జ్ఞాపికలను అందజేశారు.

సర్వ మతాల ఐక్యతకు ప్రతీక దర్గా


ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అన్ని మతాలకు నిలయం సయ్యద్‌పల్లి దర్గ అని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి సయ్యద్‌పల్లిలో ఉర్సు షరీఫ్ దర్గా ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు. సర్వ మతాల ఐక్యతకు ప్రతీకగా దర్గా నిలుస్తుందని పేర్కొన్నారు.


కొడంగల్ రూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు


పరిగి: మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కనికరం చూపని ప్రభుత్వం

- సర్కారు ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నాం
- శ్రమకు తగిన వేతనం చెల్లించి, క్రమబద్ధీకరించాలి
- అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్ల డిమాండ్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


అనంతగిరి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్ వాడీలు

అనంతగిరి: సమస్యలు పరిష్కరించాలని కొద్దిరోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా.. తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అంగన్‌వాడీలు ఆరోపించారు. సమ్మెలో భాగంగా మంగళవారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చాలా ఏళ్లుగా ప్రభుత్వానికి వెట్టి చాకిరీ చేస్తున్నా.. తమపై కనికరం చూపడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్నామని, అయినా తమను గుర్తించడం లేదంటూ మండిపడ్డారు. తమను క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్, అంగన్ వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సర్సమ్మ, ముఖ్య నాయకులు భారతి, లక్ష్మీ, సుజాత, భాగ్యలక్ష్మి, చంద్రకళ, పుష్ప, వసంత, రేణుక, భారతి, సులోచన, మంజుల, లక్ష్మీ, సంకీర్త, రాములమ్మ, ప్రమీల, కవిత, మనోహర, విజయ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసనలు వ్యక్తంచేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజలకు సేవలు చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కొడంగల్ ప్రాజెక్టు కార్యదర్శి నవనీత, సిబ్బంది శివలీల, రత్నాబాయి, వినోద, కిష్టమ్మ, సావిత్రి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం చెరువుముందలి తండాలో బీఆర్‌ఎస్ కార్యకర్త కుమారుడు లింగయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని పరామర్శించి, రూ.10 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఆయనకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉండగా.. ఔట్‌సోర్సింగ్ విభాగంలో ఉద్యోగం ఇప్పించి, మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పిల్లల చదువు బాధ్యతలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన జీహెచ్‌ఎంలు


జీహెచ్‌ఎంను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

యాలాల: మల్టీజోన్ పోస్టుల కేటాయింపుల్లో భాగంగా మండలానికి కొత్తగా ముగ్గురు జీహెచ్‌ఎంలను కేటాయించగా.. వారు మంగళవారం విధుల్లో చేరారు. జుంటుపల్లి ఉన్నత పాఠశాలకు దరిమీది రమేష్, ముద్దాయిపేట ఉన్నత పాఠశాలకు శాంతప్ప, బాలికల ఉన్నత పాఠశాలకు మల్లమ్మలు విధుల్లో చేరారు. మండలంలోని పది ఉన్నత పాఠశాలల్లో(బెన్నూరు ఉన్నత పాఠశాలకు జీహెచ్‌ఎం పోస్టు కేటాయించలేదు) కోకట్, యాలాల బాలుర ఉన్నత పాఠశాల, పగిడియాల, దేవనూరు, రాస్నం, అగ్గనూరు, జుంటుపల్లి, యాలాల బాలికల ఉన్నత పాఠశాలలకు జీహెచ్‌ఎం పోస్టులు ఉన్నాయి. కాగా మంగళవారం ముగ్గురు విధుల్లో చేరగా.. కోకట్, యాలాల బాలుర ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే జీహెచ్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన నాలుగు(రాస్నం, పగిడియాల, అగ్గనూరు, దేవనూరు) పాఠశాలలకు రెండు, మూడు రోజుల్లో జరగనున్న పదోన్నతుల్లో జీహెచ్‌ఎంలను కేటాయించే అవకాశం ఉంది. విధుల్లో చేరిన జీహెచ్‌ఎంలకు పీఆర్‌టీయూ సంఘం నాయకులు సన్మానించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు మొగులయ్య, షేక్ అహ్మద్, రమేష్, రాజు, తమ్మలి శ్రీనివాస్, జోషి రవికుమార్, వడ్డే శ్రీనివాస్, కృష్ణ ఉన్నారు.

వివాదంలో టీఎన్‌జీఓ స్థలం


పత్రాలను పరిశీలిస్తున్న సంఘం సభ్యులు

పరిగి: పరిగి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న టీఎన్‌జీఓ స్థలం వివాదంలో ఉంది. ఆ స్థలంలో ఎవరో ఇంటి నిర్మాణం చేపట్టడంతో సంఘం జిల్లా కార్యవర్గం మంగళవారం స్థలాన్ని పరిశీలించి, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బస్టాండ్ ఎదురుగా టీఎన్‌జీఓకు సంబంధించి ఏడు కమర్షియల్ షెటర్లు ఉండగా వాటి వెనకాల ఖాళీ స్థలం ఉంది. ఎవరో కబ్జా చేసి ఇళ్లు కడుతున్నారనే సమాచారంతో జిల్లా కార్యవర్గ సభ్యులు పరిశీలించారు. ఇంటిని నిర్మిస్తున్న సదరు వ్యక్తి వద్ద ఎలాంటి పత్రాలు ఉన్నాయో చూపించమని కోరగా.. వారు పత్రాలను చూపించారు. ఈ వివాదం నేపథ్యంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిర్మాణ పనులను ఆపేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకుమార్, కార్యవర్గ సభ్యుడు అంజిత్, నర్సింహులు, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆఖిరి’గౌరవానికి వైకుంఠధామం

వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్


వైకుంఠధామాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వికారాబాద్ అర్బన్: మనిషి చనిపోయాక గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకోవాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె, పట్టణాల్లో వైకుంఠధామాలు ఏర్పాటు చేయించిందని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణం గంగారం సమీపంలో నిర్మించిన వైకుంఠ ధామం ప్రారంభించి మాట్లాడారు. రూ.కోటి పది లక్షలతో వైకుంఠధామాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, పీఎసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు సురేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, రామస్వామి, కో ఆప్షన్ సభ్యుడు రాజమల్లయ్య, మాజీ కౌన్సిలర్లు బీఆర్ శేఖర్, బుచ్చిబాబు గౌడ్, రమేష్ గౌడ్, వెంకట్ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రమణ, వడ్డే అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, జ్ఞాపికను అందజేసిన ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు. - అనంతగిరి

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

బొంరాస్‌పేట: డీసీఎం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రేగడి మైలారం గ్రామానికి చెందిన రాజు(33) ద్విచక్రవాహనంపై ఊరికి వస్తుండగా.. కొడంగల్ శివారులోని జాతీయ రహదారిపై డీసీఎం ఢీకొట్టింది. దీంతో రాజుకు తీవ్రగాయాలు కాగా.. కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. చికిత్స పొందుతూ బాధితుడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, డీసీఎం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని హెడ్ కానిస్టేబుల్ శివరాజ్‌గౌడ్ తెలిపారు.

బీజేపీతోనే మహిళలకు ప్రాధాన్యత

- కౌన్సిలర్ సాహు శ్రీలత
- మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ మహిళా నాయకులు

తాండూరు టౌన్: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. మంగళవారం తాండూరు పట్టణంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, కౌన్సిలర్ సాహు శ్రీలత ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురానున్న మోదీకి మహిళల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. మహిళలకు బీజేపీ ఎంతో ప్రాధాన్యతనిస్తుందని నిరూపించారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లావణ్య, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుక, అసెంబ్లీ కన్వీనర్ అర్చన, కోకన్వీనర్ సంగీత, పట్టణ అధ్యక్షురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరువు కోసం ప్రాణం తీశారు

- పెళ్లి విషయం మాట్లాడదామని పిలిపించి యువకుడి దారుణ హత్య
- పొలంలో పాతిపెట్టిన వైనం
- ఆగస్టు 15న ఘటన
- మృతుడి సోదరుడి ఫిర్యాదుతో పోలీసుల రంగప్రవేశం
- ప్రకాశం జిల్లా అద్దంకిలో నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ నారాయణరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి


కరణ్‌కుమార్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: ఆ యువకుడు వావి వరుసలు మరిచాడు.. వరుసకు కూతురయ్యే బాలికతో ప్రేమ వ్యవహారం నడిపాడు.. ఎన్ని సార్లు నచ్చజెప్పినా వినిపించుకోలేదు.. దీంతో పరువు పోతుందని భావించిన బాలిక కుటుంబ సభ్యులు యువకుడిని హతమార్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు యువకుడి అదృశ్యం కేసును ఛేదించారు. మంగళవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు.

ఐదేళ్ల క్రితం వలస వచ్చి..

బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లా బహార గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ పాస్వాన్ కుటుంబం, దీపక్ కుమార్ పాస్వాన్ కుటుంబం ఐదు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం తెలంగాణ ప్రాంతానికి వలస వచ్చారు. ఇరు కుటుంబాల సభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామ శివారులోని కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు. ఆ సమయంలో రంజిత్ కుమార్ పాస్వాన్ పెద్ద కూతురును దీపక్ కుమార్ పాస్వాన్ తమ్ముడు కరణ్‌కుమార్ ప్రేమించాడు. కరణ్‌కుమార్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించడాన్ని బాలిక తండ్రి రంజిత్‌కుమార్ పాస్వాన్ గమనించాడు. నువ్వు నాకు తమ్ముడివి అవుతావని, నా కూతురు నీకు బిడ్డ వరుస అవుతుందని, ఇలాంటి విషయాలు మరిచి పోవాలని కరణ్‌కుమార్‌ను హెచ్చరించాడు.


ఘటనా స్థలంలో మృతదేహాన్ని వెలికి తీస్తున్న పోలీసులు

నచ్చజెప్పినా మారని తీరు

బాలిక ప్రేమ విషయంలో కరణ్‌కుమార్‌లో మార్పు రాకపోవడంతో రంజిత్ కుమార్ పాస్వాన్ తన కుటుంబాన్ని తీసుకొని మెదక్ జిల్లాలోని నస్కల్‌కు వెళ్లాడు. దీపక్ కుమార్ పాస్వాన్ తన తమ్ముడిని తీసుకొని సిద్దిపేటకు వెళ్లాడు. ఆ సమయంలో కరణ్ కుమార్ నస్కల్ వచ్చి బాలికను తీసుకొని వెళ్లిపోయాడు. బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిని రప్పించి నచ్చజెప్పి పంపించారు. బాలికను వివాహం చేసుకున్నట్లుగా ఫొటోలను కరణ్‌కుమార్ వారి సొంత గ్రామం సోషల్ మీడియాలో వేశాడు. దీంతో గ్రామంలో, బంధువుల వద్ద పరువు పోయిందని భావించిన రంజిత్ కుమార్ పాస్వాన్ తన కుటుంబంతో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామ శివారులోని కోళ్ల ఫారంలో పని చేసేందుకు వచ్చారు.

పరువు పోతుందని..

రంజిత్‌కుమార్ పాస్వాన్ కుటుంబంతో ప్రతివారం నిర్దవెల్లిలో జరిగే సంతకు వచ్చేవారు. ఆ సమయంలో కరణ్‌కుమార్ చాటుగా వచ్చి బాలికను కలిసి మాట్లాడి వెళ్లేవాడు. ఎప్పటిలాగే కరణ్‌కుమార్ ఆగస్టు 15న సంతకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు మీ పెళ్లి విషయం మాట్లాడుదామని కరణ్‌కుమార్‌ను పిలిపించుకున్నారు. అదే రోజు రాత్రి సుమారు 11:30 నిమిషాలకు రంజిత్‌పాస్వాన్, మంతోష్‌కుమార్, డబ్లూకుమార్‌తో పాటు ఇద్దరు మైనర్లు కరణ్‌కుమార్‌ను గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల వద్దకు తీసుకువెళ్లి దాడిచేసి అతిదారుణంగా హత్య చేశారు. పొలంలో గొయ్యితీసి శవాన్ని పూడ్చిపెట్టి ఎవరికి అనుమానం రాకుండా మళ్లీ వరి నాటు వేశారు. విషయం బయటకు తెలుస్తుందనే ఆలోచనతో రంజిత్‌పాస్వాన్ కుటుంబంతో ప్రకాశం జిల్లా అద్దంకికి వెళ్లిపోయారు.

సోదరుడి ఫిర్యాదుతో..

మృతుడి సోదరుడు దీపక్‌కుమార్‌పాస్వాన్ తన తమ్ముడు కేశంపేట వెళ్లి తిరిగి రాలేదని కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 29న ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో దర్యాప్తును ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను అద్దంకిలో అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. అడిషనల్ డీసీపీ శ్రీరాంకుమార్, ఏసీపీ రంగస్వామి, సీఐ లక్ష్మిరెడ్డి, ఎస్‌ఐలు ఉన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఇబ్రహీంపట్నంకు చెందిన పగడాల వెంకటేశ్(42) జనహర్షలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల భార్య గొడవపడి పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. వినాయక చవితి పండుగకు ఆమె ఇంటికి రాకపోవడంతో మనస్థాపానికి గురైన వెంకటేశ్ రెండు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి.. పోలీసులకు సమాచారం ఇవ్వగా... కేసు నమోదు చేశారు.

ఇతర సంఘాలకు ఆదర్శంగా..

- రైతుల శ్రేయస్సే సహకార సంఘం లక్ష్యం
- సబ్సిడీపై యంత్ర పరికరాల పంపిణీ
- భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

తుర్కయంజాల్: రైతు సేవా సహకార సంఘాలు వ్యాపార దృష్టితో కాకుండా రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్, డీసీసీబీ వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన మంగళవారం సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాలతో పాటు వ్యవసాయ యంత్రాలను సబ్సిడిపై పంపిణీ చేయాలని సూచించారు. సహకార సంఘాన్ని రాష్ట్రంలో ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలపాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వంతో మాట్లాడి కొహెడలో గోదాముల నిర్మాణానికి భూమిని సమకూర్చిన విషయాన్ని గుర్తుచేశారు. 199 ఎకరాల్లో నిర్మించనున్న పండ్లమార్కెట్ ఆసియా ఖండంలోనే అతిపెద్దదని రూ.450 కోట్లతో త్వరలో సీఎం కేసీఆర్ మార్కెట్ పనులను ప్రారంభించనున్నారన్నారు. మలక్‌పేటలోని గంజ్‌ను కూడా కొహెడకే తరలించనున్నారని, భవిష్యత్తులో స్థానికులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనుందన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉండబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లి రావాలంటే ఒక రోజు సమయం పట్టేదని, నేడు సమీపంలోకే కార్యాలయాలు రావడంతో ప్రజాపాలన సులువైందన్నారు. బొంగ్లూర్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు మెట్రో విస్తరించనున్నారని, 20 ఏళ్ల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. డీసీసీబీ ఛైర్మన్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సహకార సంఘాలు పనిచేస్తున్నాయన్నారు. అనంతరం సంఘం సెక్రటరీ రాందాస్ సొసైటీ ఆదాయ, వ్యయాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, వైస్ ఛైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు కొంద్రు స్వప్న శ్రీనివాస్, జక్క రాంరెడ్డి, చాపల యాదగిరి, సామ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.